ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

గురజాడ గేయాలు – వస్తు రూప పరిశీలన

Dr. D. Vijayakumari

Assistant professor, Department of Telugu, University of Hyderabad

Article Received: 03/09/2026

Article Accepted: 10/10/2026

Published Online: 12/10/2026

DOI:10.53414/Sahithyatharangini.2026.3.4.8

వ్యాస సంగ్రహం

గేయం మానవుని మనసులోని భావాన్ని స్పష్టంగా వ్యక్తం చేయడానికి ఉపకరిస్తుంది. అంతేగాక అది మౌఖికంగా ప్రచారం పొందుతూ విశ్వమంతా వ్యాపిస్తుంది. పద్యం కంటే గేయం వేగంగా ప్రజలకు చేరుతుంది. అందువల్లనే గురజాడ అప్పారావుగారు దేశియమైన వస్తువుని తీసుకుని 'లోకమక్క, కాసులు, కన్యక, పూర్ణమ్మ, మనిషి, దేశభక్తి, దించు లంగరు, లంగరెత్తుము, మిణుగురులు' మొదలైన గేయాలను రాశారని చెప్పవచ్చు. ఈ గేయాలలోని కొన్ని అంశాలను తీసుకుని అందలి వస్తువును, రూపాన్ని పరిశీలించడమే ఈ వ్యాస ఉద్దేశం.

కీలక పదాలు:వస్తువు, రూపం, నవ్యత, విశ్వశాంతి, దేశియమైన వస్తువు, స్వదేశాభిమానం, విశ్వమానవ ప్రేమ, సందేశం మొదలైనవి.

ఉపోద్ఘాతం

గురజాడ రచనలలో నవ్యతతో బాటు, సమాజం పట్ల బాధ్యత వ్యక్తమవుతాయి. ఆయన సాంఘికపరమైన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సంఘ సంస్కరణాభిలాషతో భవిష్యత్తరాలకు ఉపకరించే వస్తువును ఎంచుకుని గేయాలను రచించారు. గురజాడ 'కాసులు' గేయంలో పవిత్రమైన దాంపత్య జీవితానికి పునాదివేసి స్త్రీకి ఉన్నతమైన స్థానాన్ని ఇచ్చారు. కన్యక గేయంలో రాచరిక వ్యవస్థలో రాజులు స్త్రీల మానాభిమానాలకు ప్రాధాన్యతనివ్వడంలేదనే విషయాన్ని పరోక్షంగా తెలిపారు. ఆయన రాసిన 'పూర్ణమ్మ'గేయంలోని వస్తువు, కన్యాశుల్కం

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

నాటకంలోని వస్తువు ఒకే అంశానికి చెందినది. ఆయన విశ్వమానవ ప్రేమను చాటే 'మనిషి' అనే మరొక చిన్నగేయం రాశారు. గురజాడ రాసిన గేయాలన్నింటిలోకి దేశభక్తి గేయం ప్రజలలో స్వదేశాభిమానం పెంపొందింపజేసే రచన. ఇంకొక గేయం 'దించు లంగరు' విశ్వశాంతిని కోరి రాశారు. ఆయన మరణించే ముందు రాసినది 'లంగరెత్తుము' అనే గేయం ఆత్మాశ్రయమైనది. 'మిణుగురులు' అనే గేయం బాలల మనసుకి హత్తుకునే విధంగా రాశారు. ఆయన తన గేయాల ద్వారా సామాజిక స్పృహను కలిగించారు. వచన గేయానికి మొదటి లక్షణం నిరాడంబరత. వచన గేయంలో మాత్రాఛందస్సు ఉంటుంది. గురజాడ రాసిన గేయాల యందు పాఠకుని చేత ఆద్యంతం చదివించగల సొగసు ఉంటుంది. ఆయన 1910 జులై నెలలో తన 48 వ ఏట ముత్యాలసరాలు రూపొందించారు. ఆయన ముత్యాల సరాలు 'మిశ్రగతి'లో ఉంటాయి. గురజాడ గేయాలలో సామాజికాంశాలతో బాటు, రూపపరమైన పరిశీలన కూడ చేయవచ్చు.

వస్తు పరామర్శ

'వస్తువు'ని ఆంగ్లంలో 'Content' అంటారు. ప్రకృతిలో ఉన్న ప్రతి వస్తువు రూపంతోనే కనబడుతుంది. సామాజిక, రాజకీయ, చారిత్రక,తాత్విక దృక్పధం, మానవ సంబంధాలు మొదలైనవన్నీ సాహిత్యంలో వస్తువులు అవుతాయి.

రూప పరామర్శ

'రూపం' ని ఆంగ్లంలో 'Form' అంటారు. రూపంలేని వస్తువు ఉండదు. వస్తువులేని రూపం ఉండదు. ఈ రెండూ ఒకదానిలో ఒకటి ముడిపడి ఉంటాయి. వస్తువుని ఆశ్రయించే రూపం ఉంటుంది. సమాజంలో వచ్చే ప్రతి మార్పు సాహిత్య ప్రక్రియలలో వస్తు మార్పుకి దోహదపడతాయి. కాని అంత త్వరగా రూపంలో మార్పు రాదు.

గురజాడ గేయాలు - వస్తు పరిశీలన

గురజాడ కాసులు గేయంలో స్త్రీ పురుషులు కలసి మెలసి ప్రేమతో ఉండాలని ఈ కింది విధంగా తెలియజెప్పారు.

మరులు ప్రేమని మది దలంచకు

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

మరులు మరులును వయసులోడనే
"మాయ మర్మము లేని నేస్తము
మగువలకు మగవారికొక్కటె
బతకుకు సుకముకు రాజ మార్గము
ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును
ప్రేమ నిలిపిన ప్రేమనిలుచును" (గురజాడ సాహిత్య సర్వస్వం. 338)

పై గేయంలో గురజాడ పవిత్రమైన దాంపత్య జీవితానికి పునాదు వేశారు. ప్రేమ వారి జీవితాన్ని సుఖమయం చేస్తుందని, భార్యా భర్తలు ప్రేమను ఇచ్చిపుచ్చుకోవాలని వారిరువురి మధ్య ప్రేమ లేకపోతే జీవితం చికటిమయమవుతుందని స్త్రీని స్నేహితురాలిగాను, జీవితేశ్వరిగా భావించి, ప్రేమించాలని, ఆ ప్రేమను పంచితే అదే ప్రేమను పొందుతారని సూచించారు. **'మగడు వేల్పన పాతమాటది ప్రాణమిత్రుడ నికు'అని** రాయడంలో ఆధునికత సంతరించుకుంది. ఎన్ని యుగాలు గడిచిన ఆచరించదగిన సూక్తిని గురజాడ సమాజానికి అందజేశారని చెప్పవచ్చు.

లవణరాజు కలలో సమాజంలోని కుల వివక్షను నిరసించారు.

"మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ రండె కులములు
మంచియన్నది, మాలయైతే
మాలనే అగుదున్" (గురజాడ సాహిత్య సర్వస్వం.345)

నిష్కల్మషమైన, నిశ్చలమైన ప్రేమ ముందు కులమతాలు అడ్డుగోడలు కాకూడదని సమాజానికి ఒక దిశ నిర్దేశం చేశారు గురజాడ. మానవుని శారీరక సౌందర్యానికంటే మానసిక సౌందర్యానికి ప్రాధాన్యత నిచ్చారు. సమాజంలోని వర్ణవ్యవస్థను విడనాడి దృఢసంకల్పంతో విశ్వమానవ ప్రేమను చాటారు. భవిష్యత్తరాలకు బంగారు బాటవేశారు.

కన్యక గేయంలో స్త్రీల మానాభిమానాలను మంటగలుపుతున్న రాచరిక వ్యవస్థను వస్తువుగా తీసుకున్నారు.

"పట్టమేలే రాజువైతే అయితే

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

రాజునేలే దైవముండడొ?
పరువు నిలపను పౌరుష మీ
కేల కలుగదొకో ?" (గురజాడ సాహిత్య సర్వస్వం.345)

గరజాడ రాచరిక వ్యవస్థలో జీవిస్తూ వారి దురహంకార చేష్టలను స్వయంగా చూసిన వ్యక్తి కాబట్టి వాటిని పై గేయం లో ఆ వస్తువుని ఎంచుకుని వ్యతిరేకించే ప్రయత్నం చేశారు. సమాజంలో తమ స్త్రీలకు అన్యాయం జరుగుతున్నపుడు రాజునైనా ఎదిరించాలనే సందేశాన్ని కన్యక అనే స్త్రీ పాత్ర ద్వారా వినిపించారు.

గురజాడ అన్ని దేశాలకు, అన్నికాలాలకు వర్తించే దేశభక్తి గేయాన్ని రాశారు. ఈ గేయాన్ని ఏ దేశభాషలోకి అనువాదం చేసినా, ఆ దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పే విధంగా ఉంటుంది.

"దేశమును ప్రేమించుమన్నా - మంచి అన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్టోయి – గట్టి మేల్ తల పెట్టవోయి!
పాడిపంటలు పొంగిపొర్లే – దారిలో నువు పాటుపడవోయి

జల్దుకొని కళలెల్ల నేర్చుకు - దేశి సరుకులు నించ వోయి!
అన్ని దేశాల్ క్రమ్మవలెనోయి – దేశి సరుకుల నమ్మవలెనోయి
డబ్బు తేలేనట్టి నరులకు – కీర్తి సంపద లబ్బవోయి!"
(గురజాడ సాహిత్య సర్వస్వం.370)

పై గేయంలో గురజాడ విశ్వదర్శనం చేశారు. మానవుడు సర్వతోముఖాభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. మానవుడు కంకణబద్ధుడై దేశాభివృద్ధికి పాటు పడాలని, వ్యవసాయంచేసి పాడిపంటలు వృద్ధిచేయాలని, కళలు, విద్య నేర్చుకొని, దేశి సరుకులను తయారుచేసి, వాణిజ్యాన్ని అభివృద్ధి పరచాలని అప్పుడే కీర్తి, సంపదలు పెరుగుతాయని మానవాళికి తన గేయంద్వారా పిలుపునిచ్చారు. సొంత లాభం కొంతమానుకుని అన్ని జాతులవారు, సమాజంలోని అన్ని మతాలవారు పరస్పర స్నేహంతో మెలగాలనే సందేశాన్ని దేశభక్తి గేయం రూపంలో వినిపించారు.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

మనిషి అనే మరొక చిన్న గేయంలో ప్రతి మనిషిలోను దేవుడున్నాడే మానవతా వాదానిక్ పెద్దపీట వేశారు గురజాడ. ఆయన ఈ గేయంలో విగ్రహారాధనను నిరసించి, కొండ కోనలలో దేవుడిని వెతక వద్దని, సాటి మనిషిని రాయిరప్పల కంటే కనిష్టంగా చూడవద్దని, వారిలోనే దేవుడున్నాడని విశ్వమానవ ప్రేమతత్త్వాన్ని చాటారు.

"గరజాడ చివరి రోజులలో ఆత్మాశ్రయ కవిత్వాన్ని రాశారు.

విరిగి పెరిగితి పెరిగి విరిగితి – కష్ట సుఖముల పారమెరిగితి
పండునన్నవి ఆశలెన్నో – యెండి రాలగ బొగిలితిన్
అందజాలని పళ్లకోసము – అల్లుజూపితి, నేలపాకిన
చెట్ల పళ్ళను విలువ తెరుగక – పాదరక్షల మట్టితిన్"

(గురజాడ సాహిత్య సర్వస్వం.374)

గురజాడ మరణశయ్యపై ఉండి తన జీవితంలో తాను ఏమి సాధించాను అనే ప్రశ్న వేసుకుని ఆత్మాశ్రయమైన గేయాన్ని రాశారు. ఆయన జీవితంలో ఎదురైన కష్టసుఖాలను తనలో తననే తలచుకొని, తనని తానే దర్శించుకున్నారనే విషయం ఈ గేయంలో వ్యక్తమవుతుంది.

గురజాడ గేయాలు - రూప పరిశీలన

గురజాడ ముత్యాల సరాల ఛందస్సు, గతులను గేయాలలో గుర్తించి రాశాను. ఆయన ముత్యాలసరం లక్షణాన్ని తెలియజేశారు.

ముత్యాల సరం లక్షణం: మొదటి మూడు చరణములలోను, సామాన్యముగా పధ్నాలుగేసి మాత్రలుండును. నాలుగో చరణమున యేడు మొదలు పధ్నాలుగు వరకూ వుండును. విరామమును అర్థానుసారముగా చెవికింపగునట్లు మార్చ యత్నించితిని. ఎంత వరకు నా యుద్యమము కొనసాగెనో, మార్పులయెడ నసహనములేని చదువరులు చెప్పవలె.

(గురజాడ సాహిత్య సర్వస్వం. 472, 473)

గురజాడ – ముత్యాలసరం

ఆయన రాసిన గేయంలో ముత్యాల సరం మిశ్రగతిలో ఉన్నాయి.

మిశ్రగతి 7 అక్షరాల కాలం విలువ గలవి. తకిటకిటతక! తకిటకిటతక-!లేదా కిటతకకిట!

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

ఉదా: "గుత్తునా ముత్యాలసరములు
కూర్చుకొని తెట్టైన మాటల
----------" (గురజాడ సాహిత్య సర్వస్వం.331)

గురజాడ రాసిన కాసులు గేయంలో ముత్యాల సరాలు మొదటి మూడు పాదాలలో 14 మాత్రలు, నాలుగవ పాదంలో 9 మాత్రలున్నవి మిశ్రగతిలో ఉన్నాయి.

ఉదా: "తగటు బంగారు చిరకట్టి
కరుల పువ్వుల సరులు జుట్టి
నుదుట కుంకుమ బొట్టు పెట్టి
సొంపు పంపారన్" (గురజాడ సాహిత్య సర్వస్వం.352)

ఆయన రాసిన పూర్ణమ్మ గేయంలో చతురస్ర గతి ఉంది.

చతురస్ర గతి నాలుగు మాత్రల కాలప్రమాణం కలిగి ఉంటుంది. కిటతక! కిటతక! కిటతక! కిటతక!

ఉదా: "మేలిమి బంగరు మెలక తల్లారా
కలవల కన్నుల కన్నెలారా
----------" (గురజాడ సాహిత్య సర్వస్వం.365)

గురజాడ రాసిన దేశభక్తి గేయంలో ఖండగతి ఉంది.

ఖండగతి ఐదు మాత్రల ప్రమాణం కలిగి ఉంటుంది. కిటతకిట! కిటతకిట! కిటతకిట! కిటతకిట!

ఉదా: "దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
----------" (గురజాడ సాహిత్య సర్వస్వం.370)

అదే విధంగా ఆయన రాసిన బొట్టు గేయంలో త్రిశ్రగతి ఉంది.

త్రిశ్రగతి మూడు మాత్రల కాల ప్రమాణం కలిగి ఉంటుంది. తకిట! తకిట! తకిట!

ఉదా: "నూగు మీసపు కట్టు
కానరాని బొట్టు

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

----------" (గురజాడ సాహిత్య సర్వస్వం.378)

ఈ విధంగా గురజాడ గేయాలలోని ఛందస్సును గుర్తించవచ్చు. వ్యాస నిడివిని దృష్టిలో పెట్టుకొని కొన్ని ఉదాహరణలను మాత్రమే పేర్కొన్నాను.

ముగింపు

సెప్టెంబర్ 21.2026 నాటికి గురజాడ 164 వ జయంతి కావడంవల్ల, ఆయన సామాజిక, సంస్కరణ దృక్పథాలను ఈ వ్యాసరూపంలో మరొకసారి స్మరించుకునే ప్రయత్నం చేశాను. గురజాడ స్త్రీ పక్షపాతి. అందవల్లే స్త్రీల పురోభివృద్ధికి దోహదంచేసే గేయాలను రాశారు. స్త్రీ సమాజంలోని అన్యాయాలను ఎదిరిస్తూ, ఆత్మాభిమానంతో జీవించాలనే సూచన తన గేయాలద్వారా చేశారు. సాంఘిక పరమైన అసమానతలను, మూఢనమ్మకాలను రూపుమాపడానికి ఆయన రాసిన గేయాలు ఎంతో ఉపకరించాయి. ప్రజలలో దేశభక్తిని పెంచి, ఏ వయసు వారికైనా ప్రోత్సాహకరంగా ఉంటాయి. యువతలో ఉన్నత వ్యక్తిత్వాన్ని పెంపొదింపజేస్తాయి. ఆయన రచనలు ఎన్ని యుగాలు గడిచినా చిరస్మరణీయాలు. నేటి రచయితలు కూడ స్వప్రయోజనాల కోసం, తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేయకుండా సమసమాజ స్థాపనపై దృష్టి పెట్టవలసిన ఆవశ్యకత ఉంది.

ఉపయుక్త గ్రంథాలు

ఆరుద్ర. 2002. సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర. తెలుగు అకాడమి, హైదరాబాదు.

చెన్నకేశవ రెడ్డి, జి. 2015. ఆధునికాంధ్ర గేయకవిత్వం. జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక, హైదరాబాదు.

రమణ మూర్తి, ఆర్. వి. 2012. గురజాడ సాహిత్య సర్వస్వం. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి, తెలుగు అకాడమి హైదరాబాదు.

రాజు, ఎన్, ఎస్, 2006. వచన కవిత: రూప పరిశీలన. శ్రీ సత్య ప్రచురణలు, హైదరాబాదు.

రాజు, ఎన్, ఎస్. 1985. తెలుగులో ఛందో విశేషములు. శ్రీ సత్య ప్రచురణలు, హైదరాబాదు.

ISSN:3048-5908

Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)